# కుస్త్రీల వినోదం!

ఇంటి కొచ్చి, బట్టలు మార్చుకు, వేడివేడి టీ తాగి, రెండుకాళ్ళూ సోఫాలో పెట్టుకు కూచున్నాను. బయట చలి చలిగా ఉంది. బయట చలిగా వున్నప్పుడు లోపల మందకొడిగా ఉంటుంది. ఎదురుగా కుర్చీలో శాంతాదేవి సుఖాశీనురాలై వుంది.

మధ్యాహ్నాటి నిద్రబద్ధకం యింకా వొదల్లేదు కాబోలు ఆమెకి. తలంటి పోసుకున్ననాడు పగటినిద్ర పనికిరాదని, చెబుతాను శాంతాదేవికి. కాని అలాటి రోజునే నిద్దర కళ్ళ మీదకి కూరుకు వస్తుం దంటుంది ఆమె.

మల్లెపూవులాటి చీరె కట్టుకు, పట్టుజాకెట్టు వేసుకుంది. కళ్ళనిండా కాటుక, చేతివేళ్ళకీ కాలివేళ్ళకీ ఎర్రటి గోరింటాకు, తలంటిపోసుకున్న జడలో జాజిమల్లి కదంబం. అప్పుడప్పుడు వెంట్రుకలు మొహంమీదపడి దోబూచులాడటం, చెంపల తళ తళ, చేతిలో శరత్ పుస్తకం—యివన్నీ చూసీ చూడనట్టు చూస్తూ ఏవో కలల్లో పడ్డాను. కింద వాళ్ళు నేను చెప్పినట్టు చెయ్యక పోయినా, పై వాళ్ళకి నేను చేసినది నచ్చకపోయినా— అవన్నీ మర్చిపోగలను గదా! మూడువందలు సంపాయించినా, పదమూడువందలు సంపాయించినా జీవనచక్రానికి ఒక కేంద్రీకృత స్థానం కావాలి.

అదే యిల్లూ యిల్లాలూను. బయట హిమ బిందువులు పడుతూవుంటే లోపల వెచ్చగా వుంటుంది. బయట గ్రీష్మ తాపం మండిపోతూంటే, యింట్లో వసంత సమీరం వీస్తుంది. అందుకనే మానవ నాగరికతకి కుటుంబ వ్యవస్థ ప్రధాన మన్నారు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? వాసాలు ఎన్నిసార్లు లెక్కపెట్టినా, యిది అద్దెయిల్లే, స్వంతయిల్లు అవదు," అంది శాంతాదేవి.

నా మనసులో మెదిలే ఆలోచనలు శాంతాదేవి చూచాయగా కనిపెట్టగలదు. అలాంటప్పుడే తమీమని ఒక దెబ్బ కొడుతుంది.

"వాసాలు లెక్కపెట్టడంలేదు. నీ అందం చూస్తున్నాను," అన్నాను.

"ఏమిటన్నారు?"

"నీ అందాన్ని చూస్తున్నాను."

"బావుందిగాని సరసం—ఆ రేడియో ఒక్కసారి గోవా ట్యూన్ చేసి రండి."

వినయవిధేయ వర్తనుణ్ణి అయి, సోఫాలోనుంచి లేచి, రేడియో తిప్పడం మొదలెట్టాను. ఎంత తిప్పినా, గోవా రాలేదు.

"కబుర్లు చెప్పమంటే చెప్పగలరు." అని శరత్‌ని పక్కనున్న స్టూల్‌మీాద వుంచి, తను వచ్చి తిప్పుకుంది గోవా.

"ఏమిటి చదువుతున్నావ్ ?" అన్నాను.

"మీ కెందుకు లెద్దురూ, ఏదో తెలుగు పుస్తకం."

"నువ్వీపూట చాలా బావున్నావు."

"మళ్ళీ మొదలా ? ఇదేం పైత్యం, బాబూ ! మా అన్నయ్య కొడుకు పుట్టిన పండగ పధ్నాలుగో తారీఖున. రేపైనా ఏదో ఒకటి కొని పంపించాలి."

"నెపోలియన్ ఎన్ని పుట్టిన పండగలు చేసుకునేవాడో తెలుసా ?"—అని అగడబోతూండగా వీధి తలుపు ఎవరో దబదబ కొట్టారు. గబగబా వెళ్ళి తలుపు తెరిచి వచ్చింది శాంత.

ముకుందంగారు, రావడమే ఒక ప్రభంజనలా వచ్చారు. 'లేవండి, లేవండి. తొందరగా లేవాలి. టైమయిపోతోంది' అన్నా రాయన.

ఆయన ఖంగారు మా యిద్దరికీ అర్థం కాలేదు. 'ముందు కూచోండి," అంది శాంత.

టైము చూసుకుంటూ. 'అప్పుడే ఆరూ—అయిదు అయింది. కూచుంటే ఎలా ? శాంతా దేవి రెడీగానే ఉన్నారు. మీరు పట్టు వేసుకు రండి," అన్నారు ముకుందం గారు.

"ఏమిటి ? ఎక్కడికి ! విషయ మేమిటో చెప్పక మీ రంత హడావుడిపడితే ఎలా ?" అన్నాను సవినయంగా.

"విషయ మేమిటో దారిలో మాట్లాడుకుందాం. ముందు తొందరగా తెమలండి. ఆలస్యమయితే వెనక వరసలో కూచోబెడతాడు మనిని. మా ఫ్రెండు ఒకడిని బతిమాలుకు కారు తీసుకొచ్చాను. మన మక్కడ డ్రాప్ అయిపోయాక, కారుని వొదిలించేసుకో వచ్చును."

"ఏ పిక్చర్ కండీ?" అని అడిగింది శాంత.

"పిక్చర్ కాదు—రెజ్లింగ్," అన్నారు ముకుందంగారు.

"బాబోయ్, నేను రాను—నాకు భయమేస్తుంది. మీ యిద్దరూ వెళ్ళండి," అంది శాంతాదేవి.

"అదేమిటండోయ్, అలా మాట్లాడతారు. నారీలోకానికే అప్రతిష్ట. మా సుమతినికూడా తీసుకువద్దా మనుకున్నానుగాని—యిప్పుడు టైము లేదు. అదీగాక, వున్నవి మూడే టికెట్లు."

నేను ఈ రెజ్లింగ్ గురించి నాలుగైదు రోజులబట్టీ వింటున్నాను. ఏ నోట విన్నా యిదేమాట. కింగ్ కాంగ్, దారాసింగ్. టైగర్ హోల్డన్, రష్యన్ బేర్—ఏమి టేమిటో పేర్లు. నాకు నేనుగా ఈ రెజ్లింగ్‌కి వెళ్ళి వుండను. కాని ఒక పెద్దమనిషి వచ్చి పిలుస్తూంటే రావని అనడం మర్యాద లక్షణమా?

అసలు ముకుందంగారు ఈ టికెట్లు మాకోసమని కొనలేదు. ఎవరో ఇద్దరు ఫ్రెండ్స్ వస్తామంటే, వాళ్ళకోసమని కొన్నారు. వాళ్ళేమో ఆఖరుక్షణాన స్లిప్ యిచ్చారు. చూస్తూ మాస్తూ

టికెట్లు వృథాచెయ్యడంయిష్టంలేక, కంపెనీ కోసం మమ్మల్ని రమ్మని ప్రాధేయపడుతున్నాడు. అది ఆహ్వానమే గాని ప్రాధేయపూర్వకమైన ఆహ్వానం.

కాసేపు బెట్టుచేసి, నసిగి, రానని, మళ్ళీ ఒకక్షణం పోయాక, మమ్మల్నేదో కనికరిస్తున్నట్టుగా, రావడానికి వొప్పుకుంది శాంత. నేను ఈ తికమకలు ఏమీలేకుండా ప్రప్రథమంలోనే ముకుందంగారి ఆహ్వానం అంగీకరించాను.

మా కారు రెజ్‌లింగ్ జరుగుతున్న ప్రదేశం చేరుకునే టప్పటికి ఆరూ-యిరవై అయింది. డ్రయివరు కారుని మేఘాల మీాద నడిపాడంటే నమ్మండి. ముందు ముకుందంగారు దారి తీశారు, ఆయనవెనక శాంతాదేవి, ఆమెవెనక బాడీగార్డుకి మల్లే నేను. ఏమిజనం, ఏమిజనం! ముకుందంగారు మధ్యాహ్నం పదకొండు గంటలకి టికెట్లు తెప్పించారు గనక గాని లేకపోతే టికెట్లు దొరుకుతాయా ఏమన్నానా? ఇసక వేస్తే రాలనంత జనం అంటారే-అలా ఉంది.

పద్మవ్యూహం లాంటి దారుల్లో నుంచి మమ్మల్ని తీసుకు పోయి, కుర్చీలలో కూచోబెట్టారు. కూచున్నమీాదట ముకుందంగారు కాస్త స్థిమితపడి ఈ కబురూ ఆ కబురూ చెప్పడం మొదలెట్టారు.

నాలుగుపక్కలా గేలరీలు: గేలరీలనిండా మనుషులు. నాలుగుపక్కలా కుర్చీలు; కుర్చీలన్నీ గబగబా నిండు తున్నాయి. మధ్యని నలుచదరంగా రింగ్ ఉంది. రింగ్

అనగా అక్కడే వస్తాదులపోటీ జరుగుతుంది. రింగ్‌కి పెద్ద పెద్దతాళ్ళు కట్టారు. ముకుందంగారు మా యిద్దరికీ ఈ పోటీల తాలూకు బాగోగులు చెప్పడం ఆరంభించారు.

"ఒక్కొక్క రవుండ్ ఏడునిముషాలు, కిందపడిన మనిషి మళ్ళీ కలియబడకపోతే ఓడిపోయినట్టు. ఆరు రవుండ్స్‌లో ఎవరు ఎక్కువ రవుండ్స్ నెగ్గితే వారు నెగ్గినట్టు. ఇద్దరూ సమాన వృజ్జీలుఅయితే 'డ్రా' అవుతుంది." అన్నారు ముకుందంగారు.

"మన టెన్నిస్ మాదిరిగానే!" అన్నాను. నేను రెజ్‌లింగ్‌ని టెన్నిస్‌తో పోల్చడం, నా వెనకవరసలో కూచున్న ఒకాయన విని నవ్వుకున్నాడు.

"నాకేమిటో దుడుకుగా ఉంది," అంది శాంతా దేవి.

"ఇంకా రెజ్‌లింగ్ ప్రారంభంకానిదే!" అన్నారు ముకుందంగారు.

ఇంతలో రింగ్‌దగ్గర సంచలనం కలిగింది. పర్వతంలాంటి మనిషిని చూసి ప్రజలందరూ చప్పట్లు కొట్టారు.

"ఎవరండి అతను?" అని అడిగాను ముకుందంగారిని.

"కింగ్‌కాంగ్-జగజ్జెట్టి" అన్నారు.

నేనావిషయం శాంతాదేవికి చెప్పాను. ఆనాటి పోటీలో పాల్గొంటున్న జెట్టీలందరినీ పేరుపేరునా చెప్పారు ముకుందంగారు. ఇంతలో మైక్రోఫోనులో ఆర్గనైజరు కంఠం వినిపించింది. అమెరికన్ ఫ్రీస్టయిల్ రెజ్‌లింగ్ ప్రారంభమవుతోం

డనీ, మొదటిపోటీ ఫలానా వారిమధ్య జరగనున్నదనీ ఆ కంఠం చెప్పింది.

చిత్రకళా ప్రదర్శనాలూ, ఫిలిమ్‌ఫెస్టివల్, యమ్. ఆర్. ఎ., ఓపెన్ ఎయిర్ థియేటర్—రకరకాల ప్రదర్శనాలు చూశాం మేము. కాని యింతమంది ప్రజ గుమిగూడిన ప్రదర్శన మేము యింతవరకూ చూడలేదు. సినీమాస్టారులూ, డైరెక్టరులూ, పెద్దపెద్ద ఆఫీసర్లూ, వ్యాపారస్తులూ, లక్షాధికారులూ, గొప్పింటి ఆడబడుచులూ—వీరూ వారూ అనేమిటి, హోటల్ సర్వర్ మొదలుకొని హైకోర్టు జడ్జిదాకా, అన్ని వర్గాలవారూ అన్ని తరహాలవారూ ఉన్నారు.

రింగులోకి యిద్దరుజెట్టీలు ప్రవేశించారు. మధ్యని రిఫరీ ఉన్నాడు. పోటీ ప్రారంభమయింది. రెండుకోళ్ళూ, రెండు గొర్రెపొట్టేళ్ళూ, రెండు అడవిమృగాలూ ఎలా ఢీకొంటాయో, అలా ఢీకొన్నారు. మధ్య మధ్య ఘీంకారాలు. అన్నివేల మంది ప్రజలూ ప్రాణాలు వుగ్గబట్టుకు చూస్తున్నారు. మొదటి రవుండ్ 'డ్రా' అయిందన్నారు.

మూడో రవుండ్ జరుగుతున్నప్పుడు ఒకజెట్టీ తనవిరోధి తలకాయని రింగుతాళ్ళ మధ్యని యిరికించి మెడనొక్కేస్తూ వుండగా, శాంతాదేవి అంది; 'ఇదేమి అన్యాయం, వాడు చచ్చిపోతాడేమో పాపం!''

''అదేమీ యిబ్బంది లేదు. వాడు చావడు. బలం కూడ దీసుకుంటూవున్నాడు. రెప్పపాటు కాలంలో వాడు విజృం

భించి, అవతలి వాడిని కిందికి తోసేస్తాడు—చూస్తూ వుండండి," అని ముకుందంగారు అనడం పూర్తి అయిందో లేదో, రింగులో కథ తలకిందు లయింది. ఇందాకట్నుంచీ తాళ్ళమీద కూచుని, అవతల వాడి తలకాయ తాళ్ళ మధ్య నొక్కుతూ, వుయ్యాల వూగిన వస్తాదు, చాపచుట్టలా నేలమీదపడి, అవతల వాడికాలు జలగలా పట్టుకున్నాడు. ఆపట్టు విడిపించుకునేందుకు రెండవవస్తాదు కూడా నేలమీద పడ్డాడు. ఇద్దరూ యింక ఒకటే దొర్లడు దొర్లారు.

ఫవుల్స్ జరిగితే, రిఫరీ తన బూటు కాలుతో ఫవుల్ చేస్తున్నవాడి మొహంమీద తన్నేవాడు. మొహంమీద అలా అయిదారుసార్లు ఫెడీఫెడీ తంతేగాని, ఫవుల్ చేస్తున్న వాడు తన ఫవుల్ గేము మానేవాడు కాదు.

ఒక జెట్టీ అవతల వాడి శిరసు మోకాళ్ళమధ్యనిపెట్టి నొక్కి, వాడు తలపైకి ఎత్తినప్పుడల్లా నేలకేసి దభీదభీ కొట్టే వాడు 'నేను చూడలేను బాబూ ఈ ఘోరం. కొబ్బరి కాయ నేలనేసి కొట్టినట్టు కొడుతున్నాడు," అని రెండు కళ్ళూ మూసుకు, తన తల నా బుజంమీద వాల్చింది శాంత.

"భయపడకండి, శాంతాదేవీ, ఆ దెబ్బలు వాళ్ళకి ఒక లెఖ్ఖా? చీమకుట్టినట్టు కూడా వుండదు," అన్నారు ముకుందంగారు.

"ఇది యింకా ఎంతసేపటికి అవుతుంది" అని అడిగింది శాంత.

"మీరు రడిగేది ఈ టీమ్ విషయమా, లేక ఈ ప్రోగ్రామ్ విషయమా ?"

"ఇంకా మరికొన్ని టీములుకూడా వున్నాయా ?"

"ఇది యింకా మొదటి టీమే కాదుటండీ ! కాసేపయాక మీరే సర్దుకుంటారు. నాకూ మొదటిరోజున అల్లాగే అని పించింది," అన్నారు ముకుందంగారు.

నా దృష్టి రింగుమీద ఉంది. జెట్టీల మువ్‌మెంట్స్ వెయ్యికళ్ళతో కనిపెడుతున్నాను. నాలోని విజ్ఞానం, సంస్కారం, చారిత్రకజ్ఞానం—యివన్నీ కాసేపు నిద్రపోవ డానికి అనుమతించాయి. ఆటలు చూస్తున్నప్పుడు సహ జంగా కలిగే ఉత్సాహం, నాలోకూడా కలిగి, జనసందో హంతో నన్ను కలిపేసింది.

రెండోటీమ్‌లోని జెట్టీలు ముక్కులూ, చెవులూ కొరుక్కో వడం మొదలెట్టారు. జుట్టుపీకడం, ముక్కుపిండటం, చెవులు లాగడం—పోటీ మాట ఎటువున్నా, చూస్తున్న యావన్మం దికి నవ్వువచ్చింది.

"ఫ్రీస్టయిల్ అంటే యిదేనేమిటండీ ?" అని అడిగాను ముకుందంగారిని.

అయివుండవచ్చు నన్నట్లు తలవూపారాయన.

"ఇవేమి కుస్తీలండీ ? మా అన్నయ్య కూతుళ్ళు, ఆడు కుంటూ ఆడుకుంటూ, మధ్యనేదో పేచీవచ్చి జుట్టూ జుట్టూ

పట్టుకున్నట్టు!'' అని శాంతాదేవి కూడా ఫకాలున నవ్వింది.

ఇప్పుడేమి నవ్వినా, ఇంటికెళ్ళాక నాకు చీవాట్లు తప్పవు. ఇంటికి వెళ్ళేదాకా కూడా ఎందుకు—ముకుందంగారి మొహం చాటు అయాక, మనకి మిగిలేవి సన్నసన్నటి చీవాట్లు. అందుకు రెడీ అయిపోయాను.

మూడో రవుండ్ ప్రారంభమయింది. ముకుందంగారు చెప్పారు శాంతాదేవితో: "చూడండి. చూడండి—ఎర్రగా లావుగా ఎలుగుబంటిలా వున్నాడు—అతనొక తమాషా చేస్తాడిప్పుడు."

"ఏమిటా తమాషా?" అనడిగాను.

"భారతయుద్ధం అయాక ధృతరాష్ట్రుడు, భీముడనుకుని. యినుప విగ్రహాన్ని కౌగిలించుకుంటాడు. అది ముక్క-ముక్కలై పోతుంది—జ్ఞాపకం వుందా? అలాంటి ధృతరాష్ట్ర కౌగిలితో ఎంతటి జెట్టిని పడగొట్టేస్తాడు," అన్నారు ముకుందంగారు.

"రూల్సు వొప్పుకుంటాయా అలా చేస్తే!" అన్నాను.

"రూల్సుమాట తర్వాత!" అన్నారాయన.

మూడు రవుండ్స్ అయాక ఈ ఎర్ర ఎలుగుబంటి అవతల వాడిని, తన ఆలింగనంలో బంధించి, పటపట నలిపేశాడు. చూస్తూచూస్తూ వుండగానే, అవతల వాడు కుప్ప కూలినట్లు నేలమీద పడిపోయాడు. ఆ పడిపోయిన మనిషిని స్ట్రెచర్ మీద వేసి, మా మధ్య నుంచే హాస్పటల్‌కి పట్టుకు పోయారు.

"అతను చచ్చిపోయాడా, పాపం ?" అంది శాంత.

"ఎబ్బే. స్పృహ తప్పింది. రేపు సాయంత్రానికి మళ్ళీ తయారుకాడూ !" అన్నారు ముకుందంగారు.

"అయితే, మీరు రోజూ ఈ రెజలింగ్ చూస్తున్నారా ఏమిటి ?" అని అడిగింది శాంత.

"లేదండీ, మూడురోజుల క్రితం ఒకసారి చూశాను. అంతే"

ప్రోగ్రాం అయిపోయాక ఆ జనబాహుళ్యం నించి బయట పడటానికి అరగంటసేపు పట్టింది వచ్చేటప్పుడు అయితే ముకుందంగారి ఫ్రెండ్ కారు ఉంది. ఇప్పుడు సీట్లు వెతుక్కోవాలి. బస్సు స్టాప్ జేరుకుంటూ ముకుందంగారితో అన్నాను: 'ఏమయినా, మన నాగరికతలో నైతికపతనం వచ్చేసింది. గ్రీకు కళా సౌందర్యాలని రోమనులు ఏమి అర్థం చేసుకోగలిగారు ? గ్రీకు సంస్కృతికి ఒక ఆత్మ వుండేది. రోమనులకి అధికార తృష్ణేగాని మరొకటి తెలిసేదికాదు. అందుకనే, సింహాలని పెంచి, వాటికి ఆహారంగా మనుష్యుల్ని పడేసి, సింహాలు మనుష్యుల్ని తింటూవుంటే చూసి. రోమను ప్రజలు ఆనందించేవారు. ఆత్మలేని నాగరికతకి రక్తదాహం ఎక్కువ. ఇన్ని వేలమంది యింత వేలం వెర్రిగా ఈ పోటీలుచూసి ఆనందిస్తున్నారంటే యింతకంటె ఏమనుకోగలం ? రోమను ప్రజల స్థితిలోనే మనమూ వున్నాం.'

"మీరు చెప్పింది నిజమే అనుకోండి. కాని ప్రతివిషయం అంత తరిచి చూసేపాటి తీరిక ఎక్కడ ? ఏదో చూశాం, నలుగురితోపాటు చప్పట్లు కొట్టాం—అయిపోయింది ఏమం టారు, శాంతాదేవీ !"

ఇంతలో మా బస్సు వచ్చింది. మేము ఎక్కేశాం—ముకుందంగారికి గుడ్ నైట్ చెప్తూ.

తాళం తీసి, యింట్లో పాదం పెట్టేదాకా, నాకు దుడుకు గానే వుంది—ఏ క్షణంలో అగ్నిపర్వతం పేలుతుందోనని !

"మిమ్మల్ని ఏమీ తిట్టనులెండి. మీరు భయపడకండి."

"అదికాదు."

"మీ మొహమే చెబుతోంది. అయినదానికీ కాని దానికీ ఎందుకంటాను ? మంచులో కూచున్నామా, తెల్లారే టప్పటికి నాకు జలుబు చేస్తుందేమోనని భయంగావుంది."

"నేనొకపని చెబుతాను చేస్తావూ ?"

"ఏమిటి ?" అంది.

"ముందే మిరియాల కషాయం తాగు."

ఈ స్త్రీల విషయం మాట్లాడకూడనంతటి అసహ్యమైన సంగతి లా వదిలేసి, 'అన్నాల దగ్గిర నాకు సాయం చేదురు గాని రండి' అంటూ నన్ను కొంగునకట్టుకు వంటింట్లోకి పట్టుకుపోయింది శాంతాదేవి.

---